
సాక్షి తిరుపతి

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



పరిశుభ్రతకు ప్రాధాన్యం

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీ గురుమూర్తి, డిప్యూటీ మేయర్ అభినయ్ చీపుర్లు చేతబట్టి శుభ్రం చేశారు. - 8లో



యువకుడి గల్లంతు

రాపూరు మండలం సిద్ధేశ్వరకోన జలపాతం లో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	34	24
తిరుమల	31	21
గూడూరు	36	27
నగరి	36	26

న్యూస్‌రీల్

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



అమ్మవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి దీపాంకర్ దత్త

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం సాయంత్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్త సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ మధు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారిని మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి



సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, మేయర్, కమిషనర్

తిరుపతి కల్చరల్: యువత ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపు నిచ్చారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఆదివారం మున్సిపల్ ప్రకాశం పార్క్‌లో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఇందులో మునిస్వామి(82), వినాయకం భవాని (82), చెంచయ్య(80), వెల్సామి నాదర్(80), సిద్దయ్య(87)ను శాలువలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కమిషనర్ హరిత, తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎఫ్ఏ 2 పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి 6 వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఎఫ్ఏ2 (ఫార్మేటివ్ అసెస్మెంట్-2) పరీక్షలు జరుగుతాయని డీఈవో శేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధిత సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉమ్మడి ప్రశ్నపత్రం ఆధారంగా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాలను పరీక్ష జరిగే రోజు ఎంఈవోలు సంబంధిత పాఠశాలల హెచ్ఎంలకు పంపిస్తారని చెప్పారు. పరీక్షకు గంట ముందు ఆయా హెచ్ఎంలు ప్రశ్నపత్రాలను పంపాలని ఎంఈవోలను ఆదేశించామన్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు రోజూ ఉదయం రెండు పరీక్షలు, 6,7,8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు ఉంటాయని తెలిపారు. 1 నుంచి 5 వ తరగతి విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొ సబ్జెక్టులో పరీక్షలను నిర్వహిస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు పూర్తి అయిన వెంటనే ఈనెల 10 వ తేదీలోపు జవాబుపత్రాలను అందజేయాలని చెప్పారు. ఈ విషయంలో టీచర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10 వ తేదీన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, విద్యార్థుల ప్రగతిని తెలియజేయాలన్నారు. అనంతరం ఈనెల 14 నుంచి 24 వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉంటాయని డీఈవో వెల్లడించారు.

రమణీయం..విమానోత్సవం



విమాన వాహనంపై విహరిస్తున్న విఘ్ననాథుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి విమానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అశేషసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేడు సూర్యప్రభ వాహనం

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి స్వామివారు సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తారని ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు ఉంటాయన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



చంద్రగిరి ఆత్మీయ సమ్మేళనానికి పోటెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

'చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జనసంద్రమైంది. ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఎటు చూసినా జనమే జనం. ఒక్క పిలుపుతో తరలి వచ్చిన పార్టీ శ్రేణులు చెవిరెడ్డికి ఆత్మబలమయ్యారు. యువత జేజేలతో ఆ ప్రాంతం మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన జనం ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చినవారందరికీ భోజనం, తాగునీరు అందించి సంతృప్తి పరచడంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం అదిరిందంటూ ప్రశంసలు కురిపించారు.'

వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం సూపర్ సక్సెస్

- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు
- పార్టీశ్రేణుల్లో నూతనోత్సాహం
- ప్రతి పల్లె నుంచి క్యూకట్టిన జనం
- 25 వేల మందికిపైగా విందు భోజనం
- మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తనపల్లి రోడ్డులోని ఓ ప్రదేశంలో జర్మన్ షెడ్లకింద ఆదివారం జరిగిన చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైంది. పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ముందుగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలే తమ బలమన్నారు. ఒక్క పిలుపుతో తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎంతో రుణపడి ఉంటానని వినమ్రంగా నమస్కారం చేయడంతో యువత జేజేలు పలికారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల మధ్యకు వెళ్లగలం కానీ.. అధికారంలో ఉంటూ ప్రజల వద్దకు వెళ్లి చేసిన మేలు చెప్పడమంటే ఒక్క జగనన్న పాలనలో మాత్రమే అది సాధ్యమవుతోందన్నారు. మీ బిడ్డగా.. మీలో ఒక్కనిగా.. మెలిగే తనను వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

మోహిత్ జీవితం ప్రజలకు అంకితం

యువకుడు, ఉత్సాహ వంతుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రాజకీయ జీవితం ప్రజలకు సేవ చేయడానికి అంకితం చేసే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి పిలుపునిచ్చారు.

మోహిత్ విజయం తథ్యం

చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఎదురులేదన్న విషయం గల్లీ నుంచి ఢిల్లీదాకా వినిపిస్తోందని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ చెవిరెడ్డి కుటుంబానికి ఓటమి ఉండదని చెప్పారు.

5 కి.మీ ట్రాఫిక్ జామ్

చంద్రగిరి ఆత్మీయ సమ్మేళనానికి జనం పోటెత్తడంతో తనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ వచ్చారు.

25 రకాల వంటకాలు.. 25వేల మందికి విందు

ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన పార్టీ శ్రేణులు అందరికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆధ్వర్యంలో 25 రకాల మాంసాహార వంటకాలతో 25వేల మందికిపైగా విందు భోజనం అందించారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా చెరుకు, పళ్ల రసాలు, బజ్జీలు, ఫ్రూట్ సలాడ్ తదితర పసందైన విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి స్వయంగా వడ్డించడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

రూ.954కోట్లతో చంద్రగిరి అభివృద్ధి

చంద్రగిరి నియోజకవర్గంలో రూ.954కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు. చేసిన అభివృద్ధిని పుస్తక రూపంలో ప్రచురించి ప్రతి ఇంటికీ పంపుతామన్నారు. అభివృద్ధి జరగలేదని చెప్పే ప్రతిపక్షపార్టీ నేతలకు చూపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యేగా తనకు బాధ్యత ఉందని, పార్టీలతో సంబంధం లేకుండా పనులు చేశానన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సంక్షేమం, అభివృద్ధి పనులు చంద్రగిరిలో వందశాతం పూర్తి చేయగలిగామన్నారు. రాష్ట్రంలో చంద్రగిరిని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపానని, ఇదే వినయం, విధేయతతో తన బిడ్డ మోహిత్‌రెడ్డి కూడా పనిచేస్తాడన్నారు.

మోహిత్‌ను ఆశీర్వదించండి

మంత్రి ఆర్కే.రోజా మాట్లాడుతూ అభివృద్ధికి దిక్సూచి చెవిరెడ్డి అన్నారు. ఆయన బిడ్డ మోహిత్‌ను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భాస్కర్‌రెడ్డిలాగే మోహిత్ కూడా పట్టుదల కలిగిన వ్యక్తి అన్నారు.

రాజకీయాల్లో చరిత్ర సృష్టిస్తాడు: ఎంపీ మిథున్

వచ్చే 50 ఏళ్లు చంద్రగిరి రాజకీయాల్లో మోహిత్ చరిత్ర సృష్టిస్తాడని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. ఐదేళ్ల క్రితమే మోహిత్‌రెడ్డిని చూసినపుడు గొప్ప నాయకుడవుతాడని చెప్పానని, అది ప్రస్తుతం కళ్ల ముందు కనబడుతోందన్నారు.



మంత్రి ఆర్కే.రోజా, ఎంపీ మిథున్‌రెడ్డిని సత్కరిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



అడుగులన్నీ ఆత్మీయ సమ్మేళనం వైపే

అట్టహాసం.. ఘటోత్సవం

పోలేరమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. వెంకటగిరి జనసంద్రంగా మారింది. కిక్కిరిసిన వీధుల్లో పోలేరమ్మ ఘటం కదిలింది. పటిష్టమైన బందోబస్తు మధ్య సంప్రదాయబద్ధంగా ఈ ఘటోత్సవం ఆరంభమైంది. ఐదు రోజులపాటు సాగే ఈ జాతరలో వీఐపీ పాసులు రద్దు చేస్తున్నట్లు కమిటీ ప్రకటించింది. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులభతరం చేసింది.

- అశేష జనసందోహం నడుమ కదిలిన ఘటం
- వెంకటగిరి పోలేరమ్మ జాతర ప్రారంభం
- వీఐపీ పాసులు రద్దు : నేదురుమల్లి



వెంకటగిరిలో కిక్కిరిసిన జనం మధ్య ఊరేగుతున్న ఘటం

సైదాపురం/వెంకటగిరిరూరల్ : అశేష భక్త జనసందోహం నడుమ అత్యంత వైభవంగా పోలేరమ్మ ఘటోత్సవం ఆదివారం ప్రారంభమైంది. వెంకటగిరి జాతరలో మొదటి ఘట్టంగా భావించే ఈ ఘటోత్సవానికి భక్తులు తరలిరావడంతో పట్టణం జనసంద్రమైంది. ఏ వీధి చూసినా జనంతో కిక్కిరిసిపోయింది. గాలిగంగుల దేవస్థానం నుంచి కదిలిన ఘటం మధ్యాహ్నం 3 గంటలకు జీనిగల వారి వీధికి చేరుకుంది. అక్కడ మండపంలో సంప్రదాయ బద్ధంగా తప్పెట్లు, తాళాలు, బాణాసంచా వెలుగుల మధ్య ఘటం ఊరేగింపు ప్రారంభమైంది. అక్కడి నుంచి పోలేరమ్మ వీధి, రాజా వీధి మీదుగా పోలేరమ్మ దేవస్థానం వద్దకు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం రాజాల భవనంలోకి ప్రవేశించింది. సంప్రదాయబద్ధంగా రాజాల అనుచరులు ఘటానికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతున్న ఘటం వెంటే ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. ఈ జాతరలో 4, 5 తేదీల్లో నిర్వహించే ఉత్సవమే ప్రధానం. ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఘటోత్సవాన్ని పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఢిల్లీ బాబు, పోలేరమ్మ గుడి దేవస్థానం మాజీ అధ్యక్షులు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. బందోబస్తు విధుల్లో 8మంది ఎస్ఐలు, ముగ్గురు సీఐలు, 80 మంది సిబ్బందిని నియమించినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మూడు ఫైరింజన్లు, 108 వాహనాలను ఆలయ పరిసరాల్లో అందుబాటులో ఉంచారు.

చరిత్రలో నిలిచిపోయేలా జాతర

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా వెంకటగిరి పోలేరమ్మ జాతరను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వెంకటగిరి పోలేరమ్మ జాతర నిర్వహణపై వివిధ శాఖ అధికారులు ఆహ్వాన కమిటీసభ్యులు, వివిధ పార్టీ నేతలు, ప్రజసంఘాల నేతలతో శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ జాతరలో అమ్మవారి దర్శనం సులభతరం చేస్తూ, సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి జాతరను రాష్ట్రపండుగగా ప్రకటించిన నేపథ్యంలో మొదటి సారిగా ఈ జాతరను కనీవినీ ఎరుగని రీతిలో వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. జాతరలో భాగంగా ఐదురోజుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. భక్తులకు ఈసారి క్యూలో మజ్జిగ ప్యాకెట్లను అందిస్తామన్నారు. ఈ ఏడాది వీఐపీ పాసులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అమ్మవారి దర్శనం కోసం ఉచిత దర్శనం క్యూతో పాటు రూ.200, రూ.500 దర్శన క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జాతరలో ఆర్భాటాలకు తావివ్వకుండా ఆచారాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఆహ్వానకమిటీ సభ్యులు, పట్టణ వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి



దున్నపోతును ఊరేగిస్తున్న జాతర నిర్వాహకులు

రికార్డు స్థాయిలో రాహు–కేతు పూజలు



క్యూలను పర్యవేక్షిస్తున్న చైర్మన్ తారక శ్రీనివాసులు



కన్నప్ప వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రికార్డు స్థాయిలో రాహుకేతు పూజలు నిర్వహించారు. మొత్తం 5,655 రాహు–కేతు సర్ప దోష నివారణ పూజలు, 133 రుద్రాభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్లు రూ.200 - 4,300, 50 రూపాయల ప్రత్యేక దర్శనం టికెట్లు 5,200 విక్రయించినట్టు తెలిపారు. ఆదివారం ఒక్క రోజే శివయ్య దర్శనానికి సుమారు 30 వేల మంది భక్తులు వచ్చినట్టు వివరించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్త మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు క్యూలను క్రమబద్ధీకరిస్తూ భక్తులకు సుదర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

స్తంభించిన ట్రాఫిక్

అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ఆలయం బయటకు వెళ్లే జల వినాయకుడి గుడి, కన్నప్ప వంతెన మొత్తం పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుమారు గంట పాటు భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆలయ సెక్యూరిటీ గానీ, పోలీసులు గానీ అటు రాకపోవడంతో విమర్శలకు దారితీసింది.

ఆద్యంతం లేనిది సనాతన ధర్మం



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య జీఎస్ ఆర్. కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: ఆద్యంతాలు లేని సనాతన ధర్మ వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి తెలుగు కళా వేదిక సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ – తిరుపతి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు భారతీయ భాషా కవులతో వైభవంగా సాగిన కవి సమ్మేళనం ఆదివారం ముగిసింది. భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కార్యక్రమానికి విచ్చేసిన వారిని అభినందిస్తూ ప్రత్యేక సందేశాన్ని పంపించారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆలోచనా విధానంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. విషయ పరిజ్ఞానం పెంచుకుని, సానుకూల మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మం ఎప్పుడు పుట్టిందో చరిత్రకారులకు అందదని వక్తలు అభిప్రాయపడ్డారు. నిత్య ఉషోదయంతో దినదిన ప్రవర్ధమానమై సనాతన ధర్మం వర్ధిల్లుతుందని చెప్పారు. అన్ని భారతీయ భాషల్లో కవితా సమ్మేళనం జరగటం ఇదే ప్రథమమని వెల్లడించారు. అనంతరం విశిష్టాతిథిగా విచ్చేసిన గాలి గుణశేఖర నాయుడు మాట్లాడుతూ సనాతన ధర్మం అనే అంశంపై కవిసమ్మేళనం గొప్పగా జరిగిందన్నారు. మన ధర్మం యొక్క గొప్పతనాన్ని కవులు చక్కగా వర్ణించారని వివరించారు. దీనికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కవులు హాజరయ్యారు. సభాధ్యక్షులు ఆచార్య రంగాచార్యులు, తెలుగు వేదిక అధ్యక్షురాలు డా.కోడూరు సుమనశ్రీ, విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ రాఘవాచార్యులు, రిజిస్ట్రార్ కమాండర్ చల్లా వెంకటేశ్వర్, విభిన్న భాషాపండితులు, కవులు, సాహితీ వేత్తలు, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల ఆచార్యులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.